## క్లుప్తంగా

### కానిస్టేబుల్‌పై కేసు నమోదు

ఐనవోలు : ఏఆర్ కానిస్టేబుల్ అమరవాది రమేశ్‌పై స్థానిక పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎస్సై పస్తం శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన అమరవాది రమేశ్, అమరవాది కుమారస్వామిలు ఇద్దరు అన్నదమ్ములు. వీరిద్దరూ కానిస్టేబుళ్లుగా వేర్వేరు చోట్ల విధులు నిర్వహిస్తున్నారు. కాగా వీరికి ఐనవోలులో ఉన్న ఆస్తి విషయంలో గతంలో గొడవలు జరుగగా కుమారస్వామిపై పీఎస్‌లో కేసు నమోదైంది. అదే విధంగా కోర్టులో కేసు కొనసాగుతోంది. ఈ క్రమంలో ఇంటి వద్ద ఉన్న 19 ఖనీలు ధ్వంసం చేసి, 200 ఫీట్ల ఇనుపజాలిని రమేశ్ తీసుకెళ్లాడని ఆరోపిస్తూ కుమారస్వామి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు రమేశ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

### ఎస్సైగా పరమేశ్



శాయంపేట : శాయంపేట ఎస్సైగా జక్కుల పరమేశ్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఆత్మకూరు ఎస్సైగా పనిచేస్తున్న ఆయనను శాయంపేటకు బదిలీ చేశారు. ఇక్కడ పనిచేసిన ఎస్సై ప్రమోద్‌కుమార్ సీసీఎస్‌కు బదిలీ అయ్యారు.

### నాలుగు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత



ఐనవోలు : అక్రమంగా ఇసుక తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్నారనే సమాచారం మేరకు మండలంలోని పంథిని శివారులో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. దీంతో నాలుగు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. వాహన యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

### చైన్ స్నాచింగ్ కేసులో దర్యాప్తు వేగవంతం

కమలాపూర్ : మండలంలోని అంబాలలో శుక్రవారం రాత్రి జరిగిన చైన్ స్నాచింగ్ కేసులో పోలీసులు దర్యాప్తు వేగవంతం చేశారు. ఈ మేరకు శనివారం అంబాలలో సీసీ ఫుటేజీలను పరిశీలించారు. నలుగురు గుర్తుతెలియని యువకులు రెండు బైక్‌లపై వచ్చారని, ఇద్దరు యువకులు కిరాణంలోకి వెళ్లి దుకాణ యజమాని కెత్తె శ్రీలత మెడలోని మూడు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లారని గుర్తించారు. కానీ సీసీ ఫుటేజీల్లో నిందితుల ఫోటోలు సరిగా కనిపించడం లేదని, చైన్ స్నాచర్స్ ఎవరు, ఎక్కడి నుంచి వచ్చారనే కోణంలో విచారణ చేపట్టి దర్యాప్తు ముమ్మరం చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ హరికృష్ణ తెలిపారు.

### ఇందిరమ్మ కమిటీలను వెంటనే రద్దు చేయాలి

ఎల్కతుర్తి : రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకై నియమించిన కమిటీలను వెంటనే రద్దు చేసి పార్టీలకు అతీతంగా అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని బీజేపీ మండల అధ్యక్షుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం అవాస్ యోజన పథకంలో భాగంగా తెలంగాణకు 2లక్షల ఇళ్లను మంజూరు చేయగా అప్పటి ప్రభుత్వం వాటి ఊసే తీయలేదని మండిపడ్డారు. ప్రస్తుత ప్రజాపాలన అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం ఇస్తున్న అవాస్ యోజన పథకం ఇళ్లను ఇందిరమ్మ ఇళ్లుగా చెప్పుకుంటుందని ఆరోపించారు.

### సఖి సెంటర్ సేవలపై అవగాహన



వరంగల్: వరంగల్ కరీమాబాద్‌లోని బాపూజీనగర్ మహిళా సంఘాల సభ్యులకు వరంగల్ సఖి సెంటర్ నిర్వాహకులు శనివారం అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సఖి సెంటర్ కేస్ వర్కర్లు తిరుమల, స్వప్న మాట్లాడుతూ మహిళలకు, పిల్లలకు అందించే సేవలు వివరిస్తూ, మహిళల, బాలికల రక్షణ, భద్రత కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సఖి సెంటర్లను నడిపిస్తున్నాయని వివరించారు. ఈ సెంటర్లలో బాధిత మహిళలకు కౌన్సెలింగ్, పోలీస్, న్యాయ, వైద్య సహాయం, తాత్కాలిక వసతి వంటి సేవలను ఉచితంగా అందించనున్నట్లు తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో బయటకు రాలేని మహిళలు మహిళా హెల్ప్‌లైన్ 181 నంబర్‌కు కాల్ చేస్తే తక్షణ రక్షణ కల్పిస్తామని తెలిపారు. ప్రస్తుత సమాజంలో మహిళలు, బాలికల హక్కులు, చట్టాలు, గృహహింస చట్టం, బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు.

# ఇచ్చుళ్లపల్లి జీపీ అయ్యేనా..!

- అభివృద్ధికి దూరంగా పల్లెలు
- సంక్షేమ పథకాలు పొందాలంటే పొరుగూరికి వెళ్లాల్సిందే
- పట్టించుకోని పాలకులు, అధికారులు



వావిళ్లకుంటతండా వ్యూ

వేలేరు : మండలంలోని కన్నారం శివారు ఇచ్చుళ్లపల్లి గ్రామాన్ని, పీచర శివారు గిరిజనతండా వావిళ్లకుంటను కలుపుతూ ఇచ్చుళ్లపల్లి కేంద్రంగా నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు ఏన్నో ఏళ్లుగా డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం ఇచ్చుళ్లపల్లి కన్నారం గ్రామంలో ఆమెట్ల విలేజ్‌గా కొనసాగుతుంది. ఈ గ్రామంలో పూర్తిగా ఎస్సీ మాదిగ సామాజిక వర్గానికి చెందిన వారు మాత్రమే జీవనం కొనసాగిస్తున్నారు. ఇచ్చుళ్లపల్లిలో సూమారు 300 మంది పైచిలుకు జనాభా ఉండగా 230 వరకు ఓటుహక్కు కలిగి ఉన్నారు. పల్లె ప్రజలు వైద్యం, రేషన్ బియ్యం, పింఛన్ పొందాలన్నా, ఇక్కడి విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలన్నా, ఇతర అవసరాలకైనా కాలినడకన పొరుగూరుకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించింది. గ్రామాల అభివృద్ధికి ప్రభుత్వాలు నిధులు కేటాయిస్తున్నామని చెప్పుకుంటున్నా పల్లెలో ఇప్పటివరకు సౌకర్యాలు లేవనే విమర్శలు వినిపిస్తున్నాయి.

**మట్టిరోడ్డే దిక్కు..**

ఇచ్చుళ్లపల్లి నుంచి కన్నారం గ్రామానికి ఇప్పటికీ సరైన రోడ్డు సౌకర్యం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పరిస్థితి మరి అధ్వాన్నంగా మారుతుందని స్థానికులు వాపోతున్నారు. అత్యవసరంగా ఆస్పత్రులకు వెళ్లాలంటే తిప్పలు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ దుస్థితిని గత ప్రభుత్వ హయాంలో అప్పటి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ దృష్టికి తీసుకువెళ్లినా బీటీ రోడ్డుకు మోక్షం కలుగలేదని అంటున్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో హుస్నాబాద్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి పొన్నం ప్రభాకర్ చొరవచూపి ఇచ్చుళ్లపల్లి గ్రామాన్ని గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి అభివృద్ధికి నిధులు కేటాయించాలని కోరుతున్నారు. అలాగే వావిళ్లకుంట తండా పీచర గ్రామపంచాయతీ పరిధిలో కొనసాగుతుందని, సూమారు 200 పైచిలుకు జనాభా, 160 మంది వరకు ఓటర్లు ఉంటారని అధికారులు అంచనా వేశారు. కాగా తండా ప్రజలకు ఏ అవసరం ఉన్నా ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న పీచర గ్రామానికి వెళ్లాల్సిన పరిస్థితి నెలకొందని, బీటీ రోడ్డు కూడా గుంతలు పడి అధ్వానంగా మారిందని స్థానికులు ఆగ్రహిస్తున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు చొరవచూపి దళిత పల్లె, గిరిజన తండాలను కలుపుతూ ఇచ్చుళ్లపల్లి కేంద్రంగా నూతన గ్రామ పంచాయతీని ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

### గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి



ఇచ్చుళ్లపల్లి గ్రామం కన్నారం పరిధిలో ఉంది. పల్లెకు అరకొర నిధులు కేటాయిస్తుండడంతో ఇప్పటి వరకు ఏలాంటి అభివృద్ధి జరగలేదు. ఇచ్చుళ్లపల్లి, వావిళ్లకుంట తండాలను కలుపుతూ నూతన గ్రామపంచాయతీగా ఏర్పాటు చేయాలి.

\- రేణుకుంట్ల వెంకన్న, ఇచ్చుళ్లపల్లి

### బీటీ రోడ్డు లేక ఇబ్బందులు



ఇచ్చుళ్లపల్లి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పించాలని ప్రజాప్రతినిధులను, అధికారులను కోరుతున్నా ఎవరు పట్టించుకోవడం లేదు. నాయకులు ఎన్నికలప్పుడే గ్రామానికి వచ్చి రోడ్డు సౌకర్యం కల్పిస్తామని హామీ ఇచ్చి ఎన్నిక తరువాత ముఖం చాటేస్తున్నారు. ఇప్పటికైనా బీటీరోడ్డు నిర్మించి, రవాణా సౌకర్యం కల్పించాలి

\- వేల్పుల రవి, ఇచ్చుళ్లపల్లి

### మంత్రి, ఎమ్మెల్యే చొరవ చూపాలి



ఇచ్చుళ్లపల్లి, వావిల్లకుంట తండాలను ప్రత్యేక గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేసే విధంగా రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే కడియం శ్రీహరి చొరవచూపాలి. వావిళ్లకుంటతండా, ఇచ్చుళ్లపల్లి నుంచి మండల కేంద్రానికి వెళ్లాలంటే సరైన రోడ్డు సౌకర్యం లేదు. మంత్రి, ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలి.

\- అశోక్, వావిళ్లకుంటతండా

## రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించాలి



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

దామెర : రెడ్డి కార్పొరేషన్‌కు చట్టబద్ధత కల్పించి నిధులు కేటాయించాలని తెలంగాణ రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోపు జైపాల్ రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డికి శనివారం వినతిపత్రం అందించారు. అనంతరం జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ... 10 సంవత్సరాలుగా నిరుపేద రెడ్డి కుటుంబాల కోసం ఉద్యమాలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టింకోవడం లేదని అన్నారు. గ్రామాల్లో నిరుపేద కుటుంబాలను, విద్యార్థులను ఆదుకునేందుకు రెడ్డి సంక్షేమ సంఘాలు, పరపతి సంఘాలను ఏర్పాటు చేసి వారి సంక్షేమం కోసం చర్యలు తీసుకుంటున్నామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు 100 రోజుల్లో కార్పొరేషన్ ఏర్పాటు చేస్తామని, ఇప్పటి వరకు విధివిధానాలు, పాలక వర్గాన్ని ప్రకటించకపోవడం, నిధులు కేటాయించకపోవడం పట్ల రెడ్డి కులస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర, జాతీయ స్థాయిలో ఈడబ్ల్యూఎస్ అమలుకు చర్యలు తీసుకోవడంతో పాటు కమిషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ అర్జుల కిషన్‌రెడ్డి, నాయకులు గంగిడి ప్రభాకర్‌రెడ్డి, నర్సింహారెడ్డి, యాకుబ్ రెడ్డి, రాజిరెడ్డి, జైహింద్‌రెడ్డి, వెంకట్‌రెడ్డితో పాటు తదితరులు ఉన్నారు.

## విద్యతోపాటు నైపుణ్యం కలిగి ఉండాలి

- ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

ధర్మసాగర్ : ప్రతీ విద్యార్థి చదువుతో పాటు నైపుణ్యం కలిగి ఉండాలని స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాలలో గల ఢిల్లీ పబ్లిక్ స్కూల్ 11వ వార్షికోత్సవం శనివారం జరిగింది. ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మెరుగైన విద్య అందించాలని అన్నారు. 10 ఏళ్ల క్రితం ఢిల్లీ పబ్లిక్ స్కూల్‌ను ప్రారంభించి అనేక మంది విద్యార్థులకు విద్యనందిస్తున్న యాజమాన్యాన్ని అభినందిస్తున్నామని అన్నారు. ప్రపంచంలో అత్యున్నత స్థానాల్లో భారతీయులే ఉన్నారని, చదువు, నైపుణ్యం ఉంటే ఏ స్థాయికైనా చేరుకోవచ్చునని అన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా విద్య, వైద్య రంగాల్లో ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగలేదని అన్నారు. ఈ రంగాల్లో అభివృద్ధి జరగాలంటే పెట్టుబడులు అవసరమని ఆ దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు బడ్జెట్ కేటాయింపులు చేయడం లేదన్నారు. నాణ్యమైన విద్య అందుబాటులో లేకపోవడంతో నేడు విద్యను కొనుక్కోవాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అనంతరం కరుణాపురంలో గల (ఎంజేపీ, టీబీసీడబ్ల్యూఆర్ఎస్) రఘునాథపల్లి, జనగాం జిల్లా పరిధిలోని పాఠశాలలో న్యూ మెనూను ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో జనగాం జిల్లా అడిషనల్ కలెక్టర్ రోహిత్ సింగ్, డీపీఎస్‌లో కేయూ మాజీ వీసీ గోపాల్‌రెడ్డి, పాఠశాల చైర్మన్ రవికిరణ్‌రెడ్డి, ప్రెసిడెంట్ రాజిరెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రాకేష్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ఇన్నారెడ్డి, ఎంజేపీలో ప్రిన్సిపాల్ మంజుల, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాధికారం దిశగా ముందుకు సాగాలి

- బీఎస్ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు సుమన్



మాట్లాడుతున్న సుమన్

శాయంపేట : బహుజన రాజ్యాధికారం దిశగా సబ్బండ వర్గాలు ముందుకు సాగాలని బహుజన సంక్షేమ సంఘం ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్ అన్నారు. పేద, మధ్యతరగతి ప్రజల సంక్షేమం కోసం శనివారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట 2వ రోజు రిలే నిరాహార దీక్ష చేస్తున్న ధర్మ సమాజ్ పార్టీకి మద్దతు తెలిపారు. సుమన్ మాట్లాడుతూ.. అర్హులైన నిరుపేదలకు విద్య, వైద్యం, ఉపాధి, భూమి, ఇళ్ల సాధనకై చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు ప్రతిఒక్కరూ మద్దతు తెలుపాలని పిలుపునిచ్చారు. మెజార్టీ ప్రజలైన దళిత, బహుజనుల సంక్షేమం కోసం ఆలోచించకుండా ప్రభుత్వాలు స్వార్థపూరితమైన పాలన కొనసాగిస్తోందన్నారు. దేవయ్య, శివ, కొమురయ్య, వెంకట్, వీరన్న పాల్గొన్నారు.

## బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

- శివాజీ శక్తి కేంద్రం ఇంచార్జ్ జయంత్‌లాల్



ఎన్నికైన బూత్ అధ్యక్షులను అభినందిస్తున్న ఆర్‌పీ జయంత్‌లాల్

పరకాల : రాబోయే మున్సిపాలిటీ ఎన్నికల్లో బీజేపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలని శివాజీ శక్తి కేంద్రం ఇన్‌చార్జ్, బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌పీ జయంత్‌లాల్ అన్నారు. పరకాల మున్సిపాలిటీ పరిధిలోని 40,43,60వ బూత్ అధ్యక్షుల ఎన్నిక ప్రక్రియ శనివారం జరిగింది. 40వ బూత్ అధ్యక్షుడిగా వెనిశెట్టి రాజేష్, ప్రధాన కార్యదర్శిగా గోనెల నరసింహ, 43వ బూత్ అధ్యక్షుడిగా వెల్దండి హేమంత్, ప్రధానకార్యదర్శిగా పెగడ నిఖిత్, 60బూత్ అధ్యక్షుడిగా మరాటి నర్సింగరావు, ప్రధాన కార్యదర్శిగా పున్నం ఆనంద్ ఎంపికైనట్లు ఆయన పేర్కొన్నారు. ఈ ఎన్నిక ప్రక్రియలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు భిక్షపతి, ప్రధాన కార్యదర్శి గాజుల నిరంజన్, మున్సిపల్ మాజీ చైర్మన్ మార్త రాజభద్రయ్య, పరకాల పీఏసీఎస్ చైర్మన్ చందుపట్ల రాజేందర్‌రెడ్డి నాయకులు పాల్గొన్నారు.

## సమన్యాయం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలం

- డీహెచ్‌పీఎస్ నాయకుడు ఎల్లేష్



కరపత్రం ఆవిష్కరిస్తున్న నాయకులు

ధర్మసాగర్ : దళితుల అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో పొందుపర్చిన హక్కులు నేటికి దళితులకు అందడంలేదని, సమన్యాయం కల్పించడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని డీహెచ్‌పీఎస్ నాయకులు మద్దెల ఎల్లేష్, నిమ్మల మనోహర్, రొంటాల దేవా అన్నారు. మండలంలోని పెద్దపెండ్యాలలో శనివారం దళిత హక్కుల ఉద్యమ రెండో మహాసభల కరపత్రాలను విడుదల చేసి మాట్లాడారు. తరతరాలుగా అణిచివేత, అంటరానితనం, వివక్షత, దోపిడితో నలిగిపోతున్న దళితుల అభివృద్ధే లక్ష్యంగా అందరు పోరాడాలని పిలుపునిచ్చారు. దళితుల వాటా కోసం సమర శంఖం పూరించేందుకు 2025 జనవరి 5,6,7 తేదీల్లో హైదరాబాద్‌లోని మోక్షగుండం విశ్వేశ్వరయ్య భవన్‌లో జరిగే రెండో జాతీయ మహా సభలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాజారపు రత్నం, నాయకులు మాలోతు శంకర్ నాయక్, రాజారపు దేవయ్య, గోకుల రాజయ్య, బొడిగె కమాలాకర్, దీన, భిక్షపతి, నాగయ్య, కుమార్, అగస్టిన్, రాహుల్, శ్రీనివాస్, హర్ష తదితరులు పాల్గొన్నారు.

### మత్స్యగిరి స్వామిని దర్శించుకున్న ఏఎంసీ చైర్మన్



శాయంపేట : మండల కేంద్రంలోని మత్స్యగిరి స్వామిని పరకాల మార్కెట్ కమిటీ చైర్మన్ చందుపట్ల రాజిరెడ్డి శనివారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ కమిటీ చైర్మన్ సామల భిక్షపతి స్వామివారి శేష వస్త్రాలతో సన్మానించారు. ఆలయ అర్చకుడు ఆరుట్ల కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు చేశారు.

### ఎమ్మెల్యేను కలిసిన చంద్రప్రకాశ్

శాయంపేట : తెలంగాణ రాష్ట్ర మినిమం వేజ్‌బోర్డ్ అడ్వైజరీ సభ్యుడిగా నియామకమైన మాజీ ఎంపీపీ బాసాని చంద్రప్రకాశ్ శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావును హనుమకొండలోని నివాసంలో కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పుష్పగుచ్ఛం అందజేసి ఎమ్మెల్యేను శాలువాతో సత్కరించారు. తన నియామకానికి సహకరించినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు.

## 5 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

- ఒకరిపై కేసు నమోదు



రేషన్ బియ్యాన్ని పట్టుకున్న పోలీసులు

శాయంపేట : మండలంలోని కొప్పుల గ్రామానికి చెందిన నల్రావుల అంకుష్ గ్రామాల్లో తిరుగుతూ ప్రజల నుంచి రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేస్తుండగా పట్టుకున్నట్లు ఎస్సై పరమేశ్ తెలిపారు. ప్రజల నుంచి కొనుగోలు చేసిన 5 క్వింటాళ్ల బియ్యాన్ని మైలారం గ్రామ శివారులో గల వాటర్ ట్యాంక్ వద్ద నిల్వ చేయగా పక్కా సమాచారం మేరకు దాడులు చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకుని పంచనామా చేసి సీజ్ చేసినట్లు తెలిపారు. అంకుస్‌పై కేసు నమోదు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. బియ్యం అక్రమ రవాణా చేసినా, కొనుగోలు చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. హెడ్ కానిస్టేబుల్ వెంకట్రామ్‌నాయక్, పీసీ నాగరాజు పాల్గొన్నారు.

## తపాలా సేవలను వినియోగించుకోవాలి

- డివిజన్ పర్యవేక్షకుడు శ్రీనివాసులు



అవగాహన కల్పిస్తున్న అధికారులు

వేలేరు : తపాలాశాఖ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని పోస్టల్‌శాఖ హనుమకొండ డివిజన్ పర్యవేక్షకుడు శ్రీనివాసులు కోరారు. జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్, ఏఎస్పీ ఆదేశాల మేరకు శనివారం పీచర గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ తపాలా శాఖ సేవింగ్‌ఖాతాలు, డిపాజిట్ పథకాలు, ఇన్సూరెన్స్, యాక్సిడెంట్ పాలసీలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అలాగే 18 సంవత్సరాల నుంచి 65 ఏళ్లలోపువారికి కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను వివరించారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల పోస్ట్‌మాస్టర్లు కాంటీవాడ శ్రవణ్ కుమార్, క్రాంతి, పవన్, ఎల్లయ్య, సాయిరాం, శంకర్, రవికుమార్ పాల్గొన్నారు.

## విద్యార్థుల ఆరోగ్యం ప్రభుత్వ బాధ్యత

విద్యార్థుల చదువుతో పాటు ఆరోగ్య బాధ్యత కూడా ప్రభుత్వమే తీసుకుంటుందని జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి కొమురయ్య, జిల్లా ట్రెజరీ అధికారి శ్రీనివాసకుమార్ అన్నారు. దామెర మండల కేంద్రంలోని ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో శనివారం కామన్ డైట్ మెనూను ఆవిష్కరించారు. అలాగే ఆత్మకూరులో అడిషనల్ డీఆర్‌డీఓ శ్రీనివాస్, వేలేరులో తహసీల్దార్ కోమి, ఎంపీఓ విమల, శాయంపేటలో గురుకుల ప్రిన్సిపాల్ రజనీ, ఎల్కతుర్తిలో ఆశ్రమ పాఠశాలల సొసైటీ రాష్ట్ర ఉపసంచాలకుడు సునయన చౌహాన్ ఆవిష్కరించారు.

\- సాక్షి నెట్‌వర్క్



ఎల్కతుర్తి : మెనూ ప్రారంభిస్తున్న సునయన చౌహాన్



శాయంపేటలో..



వేలేరు : మెనూ ఆవిష్కరిస్తున్న అధికారులు



కమలాపూర్ : విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీటీఓ



కమలాపూర్ : మెనూ పరిశీలిస్తూ..



ఆత్మకూరులో..

## నడికూడకు బస్సు సర్వీస్ పునరుద్ధరణ

సాక్షి స్పందన



నడికూడకు చేరుకున్న బస్సు

నడికూడ : వరంగల్ బస్ స్టేషన్ నుంచి నడికూడకు వచ్చే బస్ సర్వీస్ పది రోజుల నుంచి రద్దు అయిన విషయం తెలిసిందే. కాగా ఈనెల 9న సాక్షిలో ప్రచురితమైన 'ఆర్టీసీ బస్సును పునరుద్ధరించాలి' అనే కథనానికి ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి స్పందించారు. హనుమకొండ డిపో మేనేజర్‌తో మాట్లాడారు. అద్దె బస్సు ఫిట్నెస్ కోసం వెళ్లగా పదిరోజుల నుంచి బస్ సర్వీస్ రద్దు చేసినట్లు మేనేజర్ తెలిపారు. దీంతో బస్సు సర్వీస్‌ను వెంటనే పునరుద్ధరించాలని ఎమ్మెల్యే కోరారు. స్పందించిన ఆర్టీసీ అధికారులు శనివారం నుంచి బస్సు సర్వీస్ పునరుద్ధరించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన సాక్షిని గ్రామస్తులు అభినందించారు.

### ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీల ఎన్నిక

వేలేరు : మండలంలోని షోడాషపల్లి, గుండ్లసాగర్ గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ గ్రామకమిటీలను ఎన్నుకున్నట్లు ఆ సంఘం మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్ తెలిపారు. షోడాషపల్లి గ్రామశాఖ అధ్యక్షుడిగా మ్యాక చిరంజీవి, ఉపాధ్యక్షుడిగా సురేష్, ప్రధానకార్యదర్శిగా మహేష్, కార్యదర్శిగా రమేష్, అధికార ప్రతినిధిగా దిలీప్, సహాయ కార్యదర్శిగా చిలుక రాజు, గుండ్లసాగర్ గ్రామశాఖ అధ్యక్షుడిగా రవి, ఉపాధ్యక్షులుగా సమ్మయ్య, వెంకటేష్, ప్రధానకార్యదర్శిగా వెంకటయ్య, కార్యదర్శిగా రాంచందర్, అధికార ప్రతినిధిగా జైపాల్‌ను ఎన్నుకున్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తామని తెలిపారు. ఎమ్మార్పీఎస్ నాయకులు పాల్గొన్నారు.

### బాల్యమిత్రుడి కుటుంబానికి బాసటగా..



బాధిత కుటుంబ సభ్యులకు ఆర్థికసాయం అందజేస్తున్న బాల్యమిత్రులు

దామెర : బాల్యమిత్రుడి కుటుంబానికి ఆర్థిక సాయం అందిచి బాసటగా నిలిచారు తోటి మిత్రులు. మండల కేంద్రంలో 1994–95 సంవత్సరంలో పదోతరగతి చదివిన కనకం రఘు ఇటీవల మృతిచెందాడు. విషయం తెలుసుకున్న అతడి మిత్రులు శనివారం రఘు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మిత్రులందరూ కలసి పోగుచేసిన రూ.86,500 బాధిత కుటుంబ సభ్యులకు అందించారు. దండ్రె శ్రీనివాస్, అశోక్, రమణాచారి, బాబు, మోహన్, శ్రీనివాస్, శివ, రమేశ్, కృష్ణ ఉన్నారు.